సాక్షి విశాఖపట్నం

గురువారం । 13 । జూన్ । 2024



కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.59.16 లక్షలు 8లో



జంక్ సైరన్ 8లో



పలు రైళ్ల నంబర్లు మార్పు 8లో

న్యూస్‌రీల్

యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

మహారాణిపేట: జిల్లాలో ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు సంబంధించి సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో పరీక్షను రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మొత్తం 9,635 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని వివరించారు. పరీక్షా కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో యూపీఎస్సీ అధికారులు, పర్యవేక్షకులు, లైజన్ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫుడ్ సైన్స్, టెక్నాలజీ కోర్సులో ప్రవేశాల గడువు పెంపు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న బీఎస్సీ–ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాల గడువును ఈ నెల 26వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలోతెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు నేరుగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం www.audoa.andhrauniversity.edu.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

సీనియర్లకు షాక్!

కొలువు తీరిన కొత్త ప్రభుత్వం సీనియర్లకు షాక్ ఇచ్చింది. పార్టీకి సుదీర్ఘ సేవలందించిన నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మొండిచెయ్యి చూపించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి మంత్రి వర్గంలో ఒక్కరికే స్థానం కల్పించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. పలుదఫాలుగా మంత్రులు పనిచేసిన గంటా, అయ్యన్నతో పాటు మూడో నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన వారి ఆశలపైనా నీళ్లు చల్లారు. మరోవైపు జనసేన నాయకులకూ ఇదే పరాభవం ఎదురైంది. గ్లాస్ కోటాలో మంత్రి పదవి ఆశించిన సీనియర్ నాయకుడు కొణతాల ఆశలూ గల్లంతయ్యాయి.



- ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఒకరికే బెర్త్
- మంత్రి పదవి ఆశించి భంగపడ్డ అయ్యన్న, గంటా, పల్లా
- బండారు, వెలగపూడికీ రిక్తహస్తాలు
- జనసేన కోటాలో కొణతాల ఆశలూ గల్లంతు
- అనితకు చోటివ్వడంపై సీనియర్ల గుర్రు



'మినిస్టర్ అయ్యన్నపాత్రుడికి శుభాకాంక్షలు' అంటూ నర్సీపట్నంలో వెలిసిన ఫ్లెక్సీలు

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రిగా చంద్రబాబు సహా 24 మంది మంత్రులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఒకే ఒక్కరికి మాత్రమే చోటు లభించడంపై సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులుండగా రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన అనితకు ప్రాధాన్యమివ్వడంపై టీడీపీ నాయకులు పెదవి విరుస్తున్నారు.

అయ్యన్న, గంటాకు చెక్ !

టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ ఒకసారి ఎంపీగా, ఏడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన చింతకాయల అయ్యన్నపాత్రుడు మూడుసార్లు మంత్రిగా వ్యవహరించారు. ఈసారీ మంత్రి పదవి వస్తుందని ధీమాగా ఉన్న అయ్యన్నకు బాబు తనదైన శైలిలో షాక్ ఇచ్చారు. మంత్రి వర్గంలో చోటు ఇవ్వకపోవడంపై అయ్యన్న కినుక వహించినట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఒకసారి ఎంపీగా, ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచిన గంటా శ్రీనివాసరావుకు రిక్త హస్తాలే ఎదురయ్యాయి. రెండుసార్లు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గంటాకు చంద్రబాబు చెక్ పెట్టారు. అదేవిధంగా.. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి ఆశించిన వెలగపూడి రామకృష్ణబాబుకు పరాభవం ఎదురైంది. పలుమార్లు పార్టీ కోసం త్యాగాలు చేసి.. రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన పల్లా శ్రీనివాసరావుకి కూడా మంత్రివర్గంలో స్థానం దక్కకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సామాజికవర్గం కోటాలో పల్లాకు రావాల్సిన మంత్రి పదవి కొలుసు పార్థసారధికి కట్టబెట్టినట్లు తెలుస్తోంది. అదేవిధంగా అయ్యన్నకు ఇవ్వాలా.. అచ్చెన్నకు ఇవ్వాలా అనే లెక్కల్లో చంద్రబాబు అచ్చెన్న వైపే మొగ్గు చూపడంతో అయ్యన్నపాత్రుడి వర్గం అధిష్టానం వ్యవహార శైలిపై గుర్రుగా ఉంది. మరోవైపు.. ఒకసారి మంత్రిగానూ, ఐదోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన బండారు సత్యనారాయణమూర్తిని కూడా చంద్రబాబు పక్కన పెట్టేశారు. మూడోసారి గెలిచిన చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు మొండిచెయ్యి చూపించారు. పార్టీ కోసం విధేయంగా ఉన్న వారితోపాటు సీనియర్లకు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడంపై విశాఖ టీడీపీ నేతలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.

గాజు గ్లాసులోనూ అసంతృప్తి జ్వాల

జనసేనలోనూ అదే అసంతృప్తి కనిపిస్తోంది. సీనియర్లుగా ఉన్నవారికి కాకుండా కొత్తగా ఎంపికైన వారికి ప్రాధాన్యమివ్వడంపై నాయకులు పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన నుంచి నలుగురు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. నలుగురిలో ఒక్కరికైనా మంత్రి పదవి దక్కుతుందని ఆశించారు. ఒక్కరికి ఇచ్చినా మిగిలిన ముగ్గురు మద్దతునివ్వాలని భావించారు. కానీ.. నలుగురికీ చంద్రబాబు, పవన్ ద్వయం మొండి చెయ్యి చూపించింది. సీనియర్ నాయకులు, మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉన్న కొణతాల రామకృష్ణకు, పంచకర్ల రమేష్‌బాబులో ఎవరికో ఒకరికి మంత్రి పదవి వరిస్తుందని భావించారు. కానీ.. వారిద్దరికీ అవకాశం కల్పించలేదు.

అదేవిధంగా ఆరేళ్లు ఎమ్మెల్సీగా కొనసాగే అవకాశం ఉన్నా రాజీనామాతో త్యాగం చేసి ఎమ్మెల్యేగా గెలిచిన వంశీకృష్ణకూ మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడంతో నిరాశలో ఉన్నారు. మొత్తంగా సీనియారిటీని పరిగణనలోకి తీసుకోకుండా చేపట్టిన మంత్రివర్గ కూర్పుపై టీడీపీ, జనసేన నేతల్లో అసంతృప్తి కనిపిస్తోంది. అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే విశాఖ జిల్లాను విస్మరించడంపై ప్రజలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బడి గంటలు మోగే వేళ

- నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు
- 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం
- పాఠశాలలకు చేరిన కానుక కిట్లు



విశాఖ విద్య : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజ**మాన్యాల పరిధిలోని** పాఠశాలలన్నీ గురువారం **తెరుచుకోనున్నాయి.** 2024–25 విద్యా సంవత్సరం వాస్తవంగా బుధవారం(జూన్ 12) ప్రారంభం కావాల్సి ఉంది. కానీ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు, సీఎం ప్రమాణ స్వీకారం ఉన్న కారణంగా వేసవి సెలవులను ఒక రోజు పొడిగించారు. దీంతో గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. గత ప్రభుత్వం అమలు చేసిన ప్రాయోజిక పథకంలో భాగంగా ఇప్పటికే సిద్ధమైన విద్యాకానుక కిట్లను మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు సరఫరా చేశారు. బడులు తెరిచిన తొలి రోజునే విద్యాకానుక కిట్లు (స్టూడెంట్ కిట్)లను విద్యార్థులకు అందజేసేందుకు పాఠశాలల్లో తగిన ఏర్పాట్లు చేశారు. విద్యా క్యాలెండర్ మేరకు తరగతులు నిర్వహించటంతో పాటు సబ్జెక్టుల బోధన సాగేలా పాఠశాలల్లో టైం టేబుల్ ప్రకటించారు. మరో పక్క స్కూళ్లలో అడ్మిషన్లపై విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. లక్ష్యం మేరకు అడ్మిషన్లు పూర్తి చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. విద్యార్థులంతా బడిబాట పట్టేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

స్కూళ్లలో పర్యావరణ వేడుకలు

పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో గురువారం నుంచి ఈ నెల 20 వరకు పర్యావరణ వేడుకలను నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు రోజు వారీ కార్యక్రమాల షెడ్యూల్ ప్రకటించారు. పాఠశాలల్లో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల్లో అవగాహన కలిగించేలా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పాఠశాలల్లో చేపట్టే ఈ కార్యక్రమాల్లో అటవీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్ కో, పొల్యూషన్, మున్సిపల్ శాఖలను భాగస్వామ్యులను చేసుకొని పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

'ఐ లవ్ కైలాసగిరి' ప్రారంభం



ఐ లవ్ కైలాసగిరి వ్యూ పాయింట్ వద్ద కలెక్టర్ మల్లికార్జున, వీఎంఆర్డీఏ అధికారులు

ఆరిలోవ: పర్యాటకులను మరింతగా ఆకట్టుకునేలా ఆధునిక హంగులతో కైలాసగిరిపై వీఎంఆర్డీఏ అధికారులు ఏర్పాటు చేసిన 'ఐ లవ్ కైలాసగిరి'వ్యూ పాయింట్‌ను బుధవారం కలెక్టర్, వీఎంఆర్డీఏ కమిషనర్ ఎ.మల్లికార్జున ప్రారంభించారు. పెద్ద పెద్ద అక్షరాలతో కూడిన బోర్డు ఏర్పాటు చేసి.. రాత్రి వేళల్లో కళ్లు మిరమిట్లు గొలిపే విధంగా విద్యుత్ దీపాలు అమర్చారు. దీన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ వీఎంఆర్డీఏ అధికారులతో కలిసి ఫొటో దిగారు. కైలాసగిరిపై సందర్శకులను ఆకట్టుకునే విధంగా వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

అయిననూ.. కట్టవలే..!

- 'బీహెచ్' వాహనదారులు పన్ను చెల్లించాల్సిందే..
- లేకుంటే కేసు నమోదు.. సీజ్
- ఇతర రాష్ట్రాల్లో ఈ రిజిస్ట్రేషన్‌తో ఇక్కడ తిరుగుతున్న కార్లు
- ఆంధ్రలోనూ ట్యాక్స్ చెల్లిస్తేనే అనుమతి
- అడ్డదారుల్లో రిజిస్ట్రేషన్లు చేయించిన 14 మంది డీలర్‌షిప్‌ల రద్దు



బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ వాహనం

సాక్షి, విశాఖపట్నం: ఒకే దేశం.. ఒకే రిజిస్ట్రేషన్ (వన్ నేషన్.. వన్ రిజిస్ట్రేషన్) విధానంతో కేంద్ర ప్రభుత్వం గతంలో బీహెచ్ రిజిస్ట్రేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. బీహెచ్ (భారత్) సిరీస్‌తో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వాహనాలు దేశంలో ఎక్కడైనా తిరగొచ్చన్న భావన పలువురిలో ఏర్పడింది. కేవలం కేంద్ర ప్రభుత్వం/ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు/నాలుగు అంతకు మించి ఎక్కువ రాష్ట్రాల్లో కార్యాలయాలున్న ప్రైవేటు కంపెనీల ఉద్యోగుల వాహనాలకు మాత్రమే బీహెచ్ రిజిస్ట్రేషన్ వెసులుబాటు కల్పించారు. వీరు తాము పనిచేసే ప్రదేశం ఉన్న రాష్ట్రంలో లేదా శాశ్వత చిరునామా కలిగిన రాష్ట్రం, ఈ రెండింటిలో ఏ ప్రదేశంలో వాహనాన్ని ఉపయోగించాలనుకుంటారో ఆ రాష్ట్రంలో వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకొని, సంబంధిత రాష్ట్ర మోటారు వాహన పన్నును చెల్లించాల్సి ఉంటుంది. ఇతరులు ఈ బీహెచ్ రిజిస్ట్రేషన్ సిరీస్‌కు అర్హులు కాదు. అయితే కొంతమంది వ్యాపారులు, ఇతర ఉద్యోగులు స్థానికంగా ఉంటూ ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటున్నట్టు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి తమ వాహనాలకు బీహెచ్ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. రాష్ట్రాలకు చెల్లించాల్సిన మోటారు వాహనాల పన్ను ఎగవేయవచ్చన్న ఉద్దేశంతో వీరు ఆ మార్గాన్ని ఎంచుకున్నారు. కొంతమంది వాహన డీలర్లు ఇలా అడ్డదారుల్లో బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంలో కీలకపాత్ర పోషించారు. నిబంధనల ప్రకారం ఈ సిరీస్ రిజిస్ట్రేషను నంబరు కలిగిన వాహనాలు ఆ రాష్ట్రంలోనే తిరిగేందుకు అనుమతి ఉంటుంది. ఇతర రాష్ట్రాల్లో తిరగాలంటే సంబంధిత రాష్ట్రానికి పన్ను చెల్లించాలి. కానీ కొంతమంది వాహనదారులు అరుణాచల్‌ప్రదేశ్ సహా మరికొన్ని రాష్ట్రాల్లో బీహెచ్ రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఆంధ్రప్రదేశ్‌కు పన్ను చెల్లించకుండా మన రాష్ట్రంలోనూ తిరుగుతున్నట్టు రవాణా శాఖ అధికారులు కొన్నాళ్ల క్రితం గుర్తించారు. ఒక్క విశాఖపట్నం జిల్లాలోనే 400 వరకు ఇలాంటి వాహనాలున్నట్టు అంచనాకొచ్చారు. వీటిలో 80 శాతం నేవీ, 10 శాతం కేంద్ర ప్రభుత్వం/ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల వాహనాలు కాగా 10 శాతం వాహనాలు అడ్డదారుల్లో బీహెచ్ రిజిస్ట్రేషన్లు చేయించినవి ఉన్నాయి. రాష్ట్రానికి మోటారు వాహన పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న వాహనదారులకు రవాణా శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇలా ఇప్పటి వరకు వీరిలో 35 మంది రూ.కోటి వరకు పన్ను చెల్లించారు.

లేదంటే ఏపీ రిజిస్ట్రేషనే..

ఇతర రాష్ట్రాల్లో బీహెచ్ రిజిస్ట్రేషన్లు చేయించుకుని రాష్ట్ర ప్రభుత్వానికి వాహన పన్ను చెల్లించకుండా విశాఖలో తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తామని రవాణా శాఖ ఉప కమిషనర్ జీసీ రాజారత్నం 'సాక్షి'కి తెలిపారు. అంతేకాదు.. అలాంటి వాహనాలను సీజ్ చేసి వారి నుంచి పన్ను రికవరీకి చర్యలు చేపడతామన్నారు. లేనిపక్షంలో ఆ వాహనదారులు బీహెచ్ రిజిస్ట్రేషన్‌కు బదులు ఏపీ రిజిస్ట్రేషన్ మార్చుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారుల్లో బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్లు చేయించిన 14 మంది వాహన డీలర్ల ఆథరైజేషన్‌ను సస్పెండ్ చేశామని చెప్పారు.

విశాఖలో సెయిలర్స్ ఇనిస్టిట్యూట్ ప్రారంభం



సెయిలర్స్ కోసం ఏర్పాటు చేసిన సాగర్

సాక్షి, విశాఖపట్నం : భారత నౌకాదళ సెయిలర్స్ కోసం సాగర్ పేరుతో ఏర్పాటు చేసిన ఇనిస్టిట్యూట్ విశాఖలో ప్రారంభమైంది. నావికుల శిక్షణ కోసం ఐఎన్ఎస్ విశ్వకర్మ బేస్‌లో ఉన్న సెయిలర్స్ ఎనెక్స్ ఇనిస్టిట్యూట్‌ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. సాగర్ పేరుతో ఆధునికీకరించిన ఈ భవనాన్ని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ బుధవారం ప్రారంభించారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో అప్‌గ్రేడ్ చేసిన సాగర్‌లో పురుషులతో పాటు మహిళా సెయిలర్స్, అగ్నివీర్‌లకు, యుద్ధ నౌకల్లో విధులు నిర్వర్తించే వారి కోసం ఏర్పాట్లు చేసినట్లు ఈఎన్‌సీ చీఫ్ అడ్మిరల్ పెందార్కర్ అన్నారు. భారత దేశ రక్షణ కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న సెయిలర్స్‌కు ఆహ్లాదకరమైన వాతావరణంలో మోటివేషన్ అందించడంతో పాటు విశ్రాంతి తీసుకునేలా సాగర్ నిర్మాణం సాగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నౌకాదళాధికారులు పాల్గొన్నారు.

సీఎం ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

- జిల్లాలో ఏడు చోట్ల ఏర్పాటు
- కలెక్టరేట్ నుంచి వీక్షించిన కలెక్టర్ మల్లికార్జున



సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తిలకిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయగా.. సంబంధిత క్రతువును ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా ప్రజలు, అధికారులు వీక్షించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పరిధిలో ఏడు చోట్ల ప్రత్యక్ష ప్రసార కేంద్రాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో ప్రజలు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు వేసి, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆయా చోట్ల ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించారు. కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికలు

పరవాడ : రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా స్థాయి ఎంపికలు ఈ నెల 15న పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో జరుగుతాయని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. అండర్–15, అండర్–13 ఓపెన్, కిడ్స్ అండర్–10 ఓపెన్ ఆర్చరీ చాంపియన్‌షిప్, రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో ఈ ఎంపికలు ఉంటాయన్నారు. విజయవాడలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో ఎంపికైన వారు పాల్గొంటారని తెలిపారు.

పీతల మూర్తీ ఇది తగునా?

- ఆగ్రహం వ్యక్తం చేసిన కార్మికులు, సీఐటీయూ నాయకులు
- జీవీఎంసీ పశు సంరక్షణ కేంద్రం ముందు ధర్నా



జీవీఎంసీ పశు సంరక్షణ కేంద్రం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

ఆరిలోవ: సక్రమంగా విధులు నిర్వర్తించిన కార్మికులను.. ఉద్యోగం నుంచి తొలగించాలని అధికారులపై ఒత్తిడి చేసిన 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌పై జీవీఎంసీ వెటర్నరీ విభాగం కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూర్తి యాదవ్ మీకిది తగునా అంటూ సీఐటీయూ నాయకులు ప్రశ్నించారు. సక్రమంగా విధులు నిర్వర్తించిన సిబ్బందిపై ప్రతాపం చూపించడం మంచి పద్ధతి కాదని మండిపడ్డారు. మూర్తి యాదవ్ తీరును నిరసిస్తూ బుధవారం ముడసర్లోవ వద్ద గల జీవీఎంసీ పశు సంరక్షణ కేంద్రం ముందు ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే. ఈ నెల 11న ఏయూ రోడ్లపై తిరుగుతున్న ఆవును జీవీఎంసీ వెటర్నరీ విభాగం కార్మికులు మునిస్వామి, రమణ పట్టుకుని జంతు సంరక్షణ కేంద్రానికి తరలించారు. దీనిపై మూర్తి యాదవ్‌కు చిర్రెత్తింది. 'మా బంధువుకు చెందిన ఆవు రోడ్డు మీద తిరిగితే పట్టుకుని జరిమానా విధిస్తారా? ఆ ఆవును పట్టుకున్న వారిని వెంటనే విధుల నుంచి తొలగించండి.' అంటూ జీవీఎంసీ అధికారులపై ఆయన ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో అధికారులు ఆ ఇద్దరు కార్మికులను విధుల నుంచి తొలగించేశారు. దీనిపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. సీఐటీయూ నాయకులు, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు, సిబ్బందితో కలసి ముడసర్లోవ వద్ద గల జీవీఎంసీ పశు సంరక్షణ కేంద్రం ముందు ఆందోళనకు దిగారు. ఈ కేంద్రంలో పనిచేస్తున్న వారంతా విధులను బహిష్కరించారు. కేంద్రం ముందు బైఠాయించి.. అధికారులు, మూర్తి యాదవ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో వెటర్నరీ విభాగం అధికారులు దిగొచ్చి.. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. విధులు నుంచి తొలగించిన రోజు(మంగళవారం) కూడా మస్తరు వేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిటు) గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ పీతల మూర్తి యాదవ్ తీరుపై మండిపడ్డారు. సక్రమంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై ప్రతాపం చూపించడం మంచి పద్ధతి కాదన్నారు. జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానంలో ఆమోదించిన ప్రకారం.. అధికారుల ఆదేశాలతో రోడ్లపై తిరుగుతున్న పశువులను కార్మికులు పట్టుకుని పశు సంరక్షణ కేంద్రంలో ఉంచుతున్నారన్నారు. వాటి యజమానులు రూ.3000 జరిమానా చెల్లించి తీసుకువెళ్తున్నారని గుర్తు చేశారు. సాధారణ ప్రజలకు ఓ పద్ధతి, ప్రజా ప్రతినిధులకు మరో పద్ధతా అంటూ ప్రశ్నించారు. ఆందోళనలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ ముద్దాడ ప్రసాదరావు, సీఐటీయూ ఆరిలోవ జోన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జంక్ సైరన్

- మార్కెట్‌లో చిరుతిళ్లతో చిన్నారులకు ప్రమాదం
- మానసిక, శారీరక వికాసంలో లోపాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు



డాబాగార్డెన్స్: 'తిండి తింటే కండకలదోయ్.. కండ కలవాడే మనిషోయ్'అని గురజాడ అన్నట్లు మంచి ఆహారమే మనకు ఆరోగ్యం. బలవర్ధకమైన తిండి తింటేనే ఏ రోగం దరిచేరదు. అయితే నగరంలోని అనేక ప్రాంతాల్లోని చిన్నారులు పోషకాహారానికి దూరవుతున్నారు. ఒకవైపు సరైన తిండి లభించక మురికి వాడల్లోని పిల్లలు పోషకాహార లేమితో బాధపడుతుండగా.. మరోవైపు తినేందుకు ఇంట్లో అన్ని రకాల ఆహార పదార్థాలు ఉండి కూడా చాలా మంది బయట చిరు తిళ్లతోనే కడుపు నింపుకుంటున్నారు. పిల్లలపై జంక్ ఫుడ్ ప్రభావం ఎక్కువగా ఉందని జాతీయ పోషకాహార సంస్థ వంటి పలు పరిశోధన సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

జంక్, రడీమేడ్ ఫుడ్‌కు అలవాటుపడి ఏ మాత్రం పోషక విలువలు లేని ఆహారాన్ని ఆరగిస్తుండడంతో పిల్లల శారీరక, మానసిక వికాసంపై తీవ్ర ప్రభావం పడుతోంది. స్కూళ్లలో చదువుకునే చిన్నారుల నుంచి ఇంటర్మీడియట్ పిల్లల వరకు ఇంటి ఆహారం కంటే బయట తిళ్లపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. లంచ్ బాక్సులకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. స్కూళ్లు, కాలేజీల్లోని క్యాంటీన్లలో లభించే ఫ్రైడ్ రైస్, నూడుల్స్, సమోసాలు, పఫ్‌లు వంటి వాటి పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఎలాంటి ఆటస్థలాలు, ఆటలు లేని స్కూళ్లు, విద్యాసంస్థల వల్ల పిల్లల ఎదుగుదలలో సమస్యలు తలెత్తుతుండగా.. ఆహారపు అలవాట్లు అందుకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల చదువులు, సాధించాల్సిన ర్యాంకులపై చూపుతున్న శ్రద్ధ.. వాళ్ల ఆహారపు అలవాట్లపై చూపడం లేదనే విమర్శలు సైతం వ్యక్తమవుతున్నాయి. నేటి నుంచి విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమవుతున్నాయి. ఈ ఏడాది నుంచైనా పిల్లలకు చక్కటి జీవన విధానాన్ని, ఆహారపు అలవాట్లను అలవాటు చేయడం తల్లిదండ్రుల బాధ్యత అని పోషకార నిపుణులు సూచిస్తున్నారు.

అల్పాహారంతోనే మొదలు

ఉదయాన్నే స్కూళ్లు, కాలేజీలకు బయలుదేరే సమయంలో ఇడ్లీ, దోశ, ఉప్మా, చపాతి వంటి ఆరోగ్యకరమైన అల్పాహారాన్ని తీసుకోవడం లేదు. పిల్లలు కనీసం గ్లాస్ పాలు, అరటి పండు, గుడ్డు వంటివి తీసుకోవాలని.. ఖాళీ కడుపుతో బయటకు వెళ్లరాదని నిపుణులు చెబుతున్నారు. కానీ ఇలాంటి సంప్రదాయ ఆహారానికి బదులు ఉదయం నుంచే రకరకాల వేపుళ్లు, అధిక క్యాలరీలు ఉన్న బిస్కెట్లు, చాక్లెట్లు వంటి వాటితో కడుపు నింపుకుంటున్నారు. ఇలాంటి ఆహారాలు వాళ్ల ఎదుగుదలకు ఏ మాత్రం దోహదం చేయకపోగా చిన్న వయసులోనే స్థూలకాయం బారిన పడేలా చేస్తున్నాయి. శరీరంలో అధిక కేలరీలు వచ్చి చేరుతున్నాయి. ఇక చాలా మంది పిల్లలు ఇంటి నుంచి స్కూల్‌కు, కాలేజీకి వెళ్లేటప్పుడు లంచ్ బాక్స్ తీసుకెళ్లడం లేదు. ఒకవేళ తీసుకెళ్లినా బాక్సులు పక్కన పెట్టేసి క్యాంటీన్ ఫుడ్‌నే ఆరగిస్తున్నారు. పిల్లల పట్ల ప్రేమ కొద్దీ కొంతమంది తల్లిదండ్రులు వాళ్ల అవసరానికి మించిన పాకెట్ మనీ ఇవ్వడంతో నచ్చిన ఫుడ్ కోసం క్యాంటీన్లు, బేకరీలకు పరుగులు తీస్తున్నారు. పిజ్జాలు, బర్గర్లు, సమోసాలు, కూల్ డ్రింకులకు అలవాటు పడటం చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.



నగరంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు



అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్లే..

తక్కువ పోషకాలుండి, ఆరోగ్యానికి హాని కలిగించే ఆహారాన్నే జంక్ ఫుడ్‌గా చెప్తారు. చిప్స్, వేపుళ్లు, తీపి పదార్థాలు, తియ్యని పానీయాలు, చాక్లెట్లు, బర్గర్లు, పిజ్జాలు , సమోసాలు, నూడుల్స్ తదితరాలన్నీ ఫాస్ట్ ఫుడ్స్ జాబితాలోకే వస్తాయి. నూనెల్లో వేయించడం మూలంగా వీటిలో ప్రొటీన్లు, విటమిన్లు తక్కువగా ఉంటాయి. అధిక కొవ్వులు కలిగి ఉండి శరీరానికి ఎక్కువ కేలరీలు అందిస్తాయి. కేవలం జంక్ ఫుడ్ మాత్రమే తీసుకునే వారు మాత్రం ఆరోగ్యపరంగా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ ఆహారం తీసుకునే చిన్నారులు పలు రోగాల భారిన పడే అవకాశాలు ఎక్కువ. వారిలో రోగనిరోధకశక్తి తగ్గిపోతుంది. తినే సమయంలో రుచిగా అనిపించినా తర్వాత వాటి పర్యవసానాలు ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయి. చిన్న వయసులోనే స్థూలకాయం, మధుమేహం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కూల్ డ్రింక్స్ వంటి వాటి వల్ల దంతక్షయం వచ్చి పండ్ల సమస్యలు వస్తాయి.

మంచి ఆహారం అలవాటు చేయాలి



మనం తీసుకునే ఆహారం విషయంలో సమతుల్యత పాటించడం తప్పనిసరి. పిల్లలకు చిన్నప్పటి నుంచే మంచి ఆహారం అలవాటు చేయాలి. చిరుతిళ్లు, జంక్‌ఫుడ్స్ అలవాటు చేయడం వల్ల చిన్న వయసులోనే స్థూలకాయానికి గురవుతున్నారు. ఫలితంగా ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. జంక్ ఫుడ్ తినాలనిపించే సమయంలో కొన్ని కూరగాయ ముక్కలను కోసుకుని తినడం మంచిది. కూల్ డ్రింక్స్‌కు బదులుగా బత్తాయి, ద్రాక్ష వంటి జ్యూస్‌లను తాగడం మేలు. చక్కెర తక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. మెదడు చురుకుదనాన్ని తగ్గించే జంక్ ఫుడ్స్‌ను ఎదుగుతున్న దశలో ఉన్న పిల్లలు తినకపోవడమే మంచిది.

– రొంగలి అప్పెంనాయుడు, చిన్న పిల్లల వైద్య నిపుణుడు

విశాఖ మార్కెట్‌లోకి బజాజ్ ఈవీ ఆటో



వినియోగదారుడికి ఆటో కీ అందజేస్తున్న చంద్రశేఖర్

టీచర్స్ రోడ్డు: బజాజ్ మొదటి ఈవీ ప్యాసింజర్ ఆటో విశాఖ మార్కెట్‌లోకి విడుదలైంది. సిరిపురంలోని వరుణ్ బజాజ్‌లో బుధవారం ఈ ఆటోను బజాజ్ రీజినల్ మేనేజర్ చంద్రశేఖర్ ఆవిష్కరించి.. తాళాలను మొదటి వినియోగదారుడికి అందజేశారు. రేంజ్ 173 శ్రేణిలో 9 కిలోవాట్ల బ్యాటరీ, ఆన్‌బోర్డ్ చార్జర్, పీఎంఎస్ఎం మోటార్, టూ స్పీడ్ గేర్ బాక్స్ మొదలైన అద్భుత ఫీచర్లతో అతి తక్కువ ధరకు ఈవీ ఆటోను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చంద్రశేఖర్ తెలిపారు. బజాజ్ ఏరియా మేనేజర్ ప్రశాంత్, వరుణ్ బజాజ్ జనరల్ మేనేజర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి



నాటడానికి సిద్ధం చేసిన మొక్కలతో అధికారులు, దివ్యాంగ చిన్నారులు

మధురవాడ: మొక్కలు నాటి సంరక్షించాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్ పిలుపునిచ్చారు. మధురవాడలోని ప్రత్యేక అవసరాల గల విద్యార్థులు, డీఈవో ఎల్. చంద్రకళతో కలసి భవిత కేంద్రంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని భవిత విద్యా కేంద్రాల్లో పూల, ఔషధ మొక్కలు నాటడం ఆనందదాయకమని, నిర్వాహకులు వీటిని సంరక్షించాలని సూచించారు. డీఈవో మాట్లాడుతూ ప్రతీ విద్యా సంస్థలో మొక్కలు నాటాలన్నారు. ఏపీ స్టేట్ ఐఈ కో–ఆర్డినేటర్ శైలా కల్పన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ కర్తవ్యంగా స్వీకరించాలన్నారు. మూడేళ్లు పెరిగిన ఓ చెట్టు ఏడాదికి ఓ టన్ను ప్రాణ వాయువు నిస్తుందని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ 10 మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త బి.శ్రీనివాస్, ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ, ఐఈ కో–ఆర్డినేటర్ బి.గీత, ఎన్‌జీసీ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ ఎస్. బాబూరావు, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకుడు జీవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.59.16 లక్షలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం బుధవారం లెక్కించారు. గత మార్చి 21 నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ఆలయ హుండీల ద్వారా వచ్చే ఆదాయాన్ని లెక్కించగా రూ.59 లక్షల 16 వేల 692 నగదు, 131 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం , కేజీ 3 గ్రాముల వెండి లభించింది. అలాగే అమెరికాకు చెందిన 20 డాలర్లు, యూఏఈకి చెందిన 5 దిర్హామ్స్, కెనడాకు చెందిన 5 డాలర్లు, సింగపూర్‌కి చెందిన 32 డాలర్లు, మలేసియాకు చెందిన 3 రింగిట్లు, వియత్నానికి చెందిన 6 వేల కరెన్సీ వచ్చింది. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఎర్నిమాంబ దేవస్థాన కార్యనిర్వహణాధికారి డీవీఎస్ సురేష్‌బాబు, కనకమహాలక్ష్మి దేవస్థాన సహాయ కార్యనిర్వహణాధికారులు వి.రాంబాబు, కె.తిరుమలేశ్వరరావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ లక్ష్మణమూర్తి, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, గోపాలపట్నం శ్రీహరి సేవ, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 14న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్, సినర్జీస్ కాస్టింగ్, ఏనంటి ల్యాబ్స్, అరబిందో ఫార్మసీ, కికువ ఇండియా, వరుణ్ మోటార్స్, మహావీర్ ఆటో డయాగ్నోస్టిక్, ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చర్స్, నియాస్ మోటార్స్, ఓలిప్ ఆటో ప్రైవేట్, విష్ణు క్యారియర్స్, యూకోమో టైర్స్, కోస్టల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ సర్వీసెస్, హోటల్ బెల్లోస్ అండ్ కో, వీఎస్ఈజెడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో 509 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ట్రైనీ కెమిస్ట్, జూనియర్ కెమిస్ట్, ఆపరేటర్ ట్రైనీ, టెక్నీషియన్స్ ట్రైనీ, హెల్పర్స్, ప్రొడక్షన్, సర్వీస్ ట్రైనీ, మెకానిక్ హెల్పర్స్, ఆపరేటర్ ట్రైనీ(మహిళలు), సెక్యూరిటీ గార్డ్స్, షాప్ ఫ్లోర్ సపోర్ట్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. 18–40 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థుల ఇంటర్వ్యూకు హాజరుకావచ్చు. ఎంపికైన వారికి నెలకు రూ15,000 నుంచి రూ.25,000 వరకు జీతం ఉంటుంది. ఆ రోజు 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అదుపుతప్పి..మృత్యు ఒడిలోకి..

- పాడేరు ఘాట్‌లో బ్రేక్ ఫెయిల్‌తో లారీ బోల్తా
- సంఘటన స్థలంలో ఇద్దరు.. చికిత్స పొందుతూ ఒకరి మృతి
- మరో ఎనిమిది మంది పరిస్థితి విషమం



పాడేరు ఘాట్‌లో బోల్తా పడిన లారీ

సాక్షి, పాడేరు: వారంతా సాధారణ కుటుంబాలకు చెందిన వారు. కుటుంబ పోషణ నిమిత్తం అచ్యుతాపురంలోని ఎస్ఎస్‌వీ సౌండ్స్‌లో దినసరి వేతనానికి పనిచేస్తున్నారు. జిల్లాలోని పెదబయలు మండల కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన మోదకొండమ్మ ఉత్సవాలకు స్టేజి లైటింగ్, సౌండ్స్ ఏర్పాటు చేశారు. మంగళవారం ఉత్సవాలు ముగియడంతో ఆ సామగ్రితో లారీలో బుధవారం మధ్యాహ్నం అచ్యుతాపురం బయలుదేరారు. వారంతా లారీలో లైటింగ్ సామగ్రిపై కూర్చున్నారు. ప్రయాణం సాఫీగా సాగిపోతుండగా ప్రమాదం సంభవించింది.

ఊహించని ఆపద

పాడేరు ఘాట్‌రోడ్డులో 12వ మైలురాయి గ్రామం వద్దకు వచ్చేసరికి వారికి ఊహించని ఆపద ఎదురైంది. వారు ప్రయాణిస్తున్న లారీకి బ్రేక్‌లు ఫెయిల్ అవడంతో.. అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. లారీలో ఉన్న సామగ్రితో కలిపి 15 మంది లోయలో పడిపోయారు. వారిపై సామగ్రి పడిపోవడంతో సంఘటన స్థలంలోనే చోడవరం మండలం బెన్నవోలుకు చెందిన మజ్జి హరీష్ (20), అచ్యుతాపురానికి చెందిన పంచదార్ల లక్ష్మణ్ (20) సంఘటన స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా, స్వల్పంగా గాయపడిన మిగతా 13 మందిని పాడేరు జిల్లా ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యలమంచిలి మండలం షేక్లిపాలెంకు చెందిన రాయి అశోక్ (30) ప్రాణాలు విడిచాడు. మిగతా 12 మందిలో లంకా శ్రీను (30), విదర్ల మోహన్ (20), లంకా దీక్షిత (4), భీముని రవి (24), గొర్లె రోహిత్‌కుమార్ (21), సేనాపతి గణేష్ (30), కొన్నిపూడి పవన్ (20), చందక రాజు (20) తీవ్రంగా గాయపడటంతో పరిస్థితి విషమంగా ఉంది. పైల భారతి, ఆదారి నితిన్, లంక సునీతతో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యా యి. తీవ్రంగా గాయపడిన వారిలో పవన్, రాజు, గణేష్‌ను కేజీహెచ్‌కు బుధవారం రాత్రి రిఫర్ చేశారు.

ముగ్గురిలో ఇద్దరు అవివాహితులు..

మృతులు ముగ్గురిలో ఇద్దరు అవివాహితులు. పంచదార్ల లక్ష్మణ్‌కు భార్య, చిన్నారి (4), తల్లి చిలకమ్మ ఉన్నారు. వీరంతా అతని సంపాదనపై ఆధారపడ్డారు. లక్ష్మణ్ మృతితో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది. క్షతగాత్రులందరికి తక్షణ వైద్యం అందించేలా కలెక్టర్ విజయ సునీత చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆస్పత్రిని సందర్శించిన ఆమె అత్యవసర వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. మృతులు హరీష్, లక్ష్మణ్, రాయి అశోక్ ఆయా కుటుంబాలకు చేదోడువా దోడుగా నిలుస్తున్నారు. వారి మృతితో ఆయా కుటుంబాలు పోషించే దిక్కును కోల్పోయాయి.

పోలీసుల తక్షణ స్పందన : ప్రమాద సమాచారం తెలుసుకున్న సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ లక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను, క్షతగాత్రులను బయటకు తీసి 108, ప్రైవేట్ వాహనాల్లో హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు బుధవారం రాత్రి పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో బంధువుల రోదనలు మిన్నంటాయి. క్షతగాత్రుల్లో షేక్లిపాలెం, యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం, కొత్తపాలెంలోని ధర్మవరానికి చెందినవారున్నారు.

నేడు పాలిటెక్నిక్ సీట్ల కేటాయింపు



మురళీనగర్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తయిన నేపథ్యంలో సీట్లను గురువారం కేటాయిస్తారు. జిల్లాలోని కంచరపాలెం గైస్, పాలిటెక్నిక్, పెందుర్తి పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రాల్లో విద్యార్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. మొత్తం 3,968 మంది తమ సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకున్నారు. గైస్‌లో 1,568 మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 1,814, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 586 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. వెబ్ ఆప్షన్ల సమయంలో కూడా చాలా మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేయించుకుని సర్టిఫికెట్లు చేయించుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 8 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు, 19 ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. కంచరపాలెం పాలిటెక్నిక్, గైస్, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్, భీమిలి మహిళా పాలిటెక్నిక్, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాడేరు రెసిడెన్షియల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు ఉన్నాయి. సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టును ఆయా కాలేజీల్లో ఈనెల 14వ తేదీ నుంచి 19వ తేదీలోగా ఇవ్వాల్సి ఉంటుంది.

పలు రైళ్ల నంబర్లు మార్పు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న పలు రైళ్ల నంబర్లు జూలై 1వ తేదీ నుంచి మార్పు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు మార్పులను గమనించాలని కోరారు.

- విశాఖపట్నం–కడప–విశాఖపట్నం (17488/17487) తిరుమల ఎక్స్‌ప్రెస్‌లు 18521/18522 నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–బనారస్–విశాఖపట్నం (18311 / 18312) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు ఇకపై 18523 /18524 నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం (18514/18513)నైట్ ఎక్స్‌ప్రెస్‌లు ఇకపై 18527 /18528 నంబర్లతో నడుస్తాయి.
- కటక్–గుణుపూర్–కటక్ (08421 / 08422) ప్యాసింజర్లు ఇకపై 68433/68434 నంబర్లతో నడుస్తాయి
- విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం (08551 /08552) ప్యాసింజర్లు ఇకపై 58501/58502 నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–రాయ్‌పూర్–విశాఖపట్నం (08528 /08527) ప్యాసింజర్లు ఇకపై 58528/58527) నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–కోరాపుట్–విశాఖపట్నం (08546 / 08545) ప్యాసింజర్లు ఇకపై 58538 /58537) నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–బ్రహ్మపూర్–విశాఖపట్నం (08531 / 08532) ప్యాసింజర్లు ఇకపై 58532 /58531) నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–గుణుపూర్–విశాఖపట్నం (08522 / 08521) ప్యాసింజర్లు ఇకపై 58506 /58505) నంబర్లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–భవానీపట్నం–విశాఖపట్నం(08504 /08503) ప్యాసింజర్లు ఇకపై 58504 /58503 నంబర్లతో నడుస్తాయి.

ఓ రైలు రద్దు.. మరికొన్ని రీషెడ్యూల్

ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న భద్రతాపరమైన, ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు, మరికొన్ని రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బుధవారం బయల్దేరాల్సిన తాంబరం–సంత్రగచ్చి (22842) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- బుధవారం ఉదయం 10.35 గంటలకు బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరింది.
- బుధవారం రాత్రి 7 గంటలకు బయల్దేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–హౌరా (12840) ఎక్స్‌ప్రెస్ సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు బయల్దేరింది.
- బుధవారం రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన సంత్రగచ్చి– చెన్నై ఎగ్మోర్ (06080) స్పెషల్ సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా గురువారం తెల్లవారు 4 గంటలకు బయల్దేరింది.

పలాస ప్యాసింజర్ గమ్యం కుదింపు

పూండి–నౌపడ సెక్షన్‌లో జరుగుతున్న పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలాస–విశాఖపట్నం–పలాస (07471 / 07470) ప్యాసింజర్ స్పెషల్ ఈనెల 13వ తేదీన శ్రీకాకుళం రోడ్ వరకే రాకపోకలు సాగిస్తుంది.